సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



బుట్ట బొమ్మ పువ్వు..

రంగురంగుల బుట్టబొమ్మ పువ్వులు.. సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. వీటిని చైనీస్ లాంతరు, రెడ్ వీన్ ఇండియన్ మాలో అని కూడా పిలుస్తారు. దక్షిణ బ్రెజిల్, అర్జెంటీనా, పరాగ్వే, ఉరుగ్వే తదితర ప్రాంతాల్లో వికసించే ఈ పువ్వులు విశాఖలోని పెదవాల్తేరు బయోడైవర్సిటీ పార్కులో ఇలా విరబూశాయి.

– బీచ్‌రోడ్డు (విశాఖ)

ఉష్ణోగ్రతలు

గురువారం

		గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	:	35.8/24.8
చోడవరం	:	35.0/25.0

న్యూస్‌రీల్

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈవో అప్పారావు, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు

ఎస్.రాయవరం: ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహిస్తూ పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత కోచింగ్ నిర్వహించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు అన్నారు. ఈ నెల 5 నుంచి పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ ప్రారంభించే పోస్టర్‌ను అనకాపల్లిలో డీఈవో ఆవిష్కరించారు. ఈ మేరకు గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థికి ఉచిత కోచింగ్ ఇస్తామని మండల కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు.

పదో తరగతి మూల్యాంకనం ప్రారంభం

- జిల్లాలో మూడు ప్రధాన హైస్కూళ్లలో మూల్యాంకనం
- గట్టి పోలీసు బందోబస్తు

అనకాపల్లి: జిల్లాలో పదోతరగతి మూల్యాంకనం ఈనెల 9వ తేదీ వరకూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నట్టు డీఈవో గిడ్డి అప్పారావునాయుడు చెప్పారు. పట్టణంలో వేల్పులవీధి టౌన్ బాలికోన్నత పాఠశాల, గవరపాలెం చిన్న హైస్కూల్, మండలంలో ఏఎంఏఎల్ హైస్కూల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు మూల్యాంకన జరుగుతుందన్నారు. మూల్యాంకన జరిగే ప్రదేశాల్లో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని, ముల్యాంకనం చేసే ఉపాధ్యాయులను మాత్రమే కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందన్నారు. మూల్యాంకన అనంతరం పూర్తి వివరాలను ఉన్నత స్థాయి విద్యాశాఖ అధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు.

నేడు జాతీయ మానవ హక్కుల కమిషన్ మెంబర్ రాక

మహారాణిపేట: జాతీయ మానవ హక్కుల కమిషన్ మెంబర్ ఎస్.విజయ భారతి శుక్రవారం విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో ఉదయం 8.25 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. బ్రాండెక్స్ వద్ద జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. 5వ తేదీన ఉదయం 9 గంటలకు విమానంలో హైదరాబాద్ బయలుదేరుతారు.



మందుల దుకాణం నిర్వహించాలంటే ఫార్మసిస్టు ఉండాలి..మందు ఎలా వేసుకోవాలో రోగికి విడమరిచి చెప్పాలి..వైద్యుడు రాసిచ్చిన చీటీ ఉంటేనే మందులు విక్రయించాలి.. రోగి శారీరక, మానసిక పరిస్థితిని బట్టి అవసరమైన మందులు ఇవ్వాలి..మందుల విక్రయాలకు సంబంధించి రికార్డులు, సేల్ రిజిస్టర్లు నిర్వహించడం, బిల్లులు ఇవ్వడం... ఇలా మెడికల్ షాపుల నిర్వాహకులు కచ్చితమైన నిబంధనలు పాటించాలి. కానీ ఔషధ నియంత్రణ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ నిబంధనలేవీ కచ్చితంగా అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మెడికిల్‌షాపులు

- డాక్టర్ చీటీ లేకుండానే మందులు
- కాలం చెల్లినవి, స్టెరాయిడ్స్ అంటగడుతున్న నిర్వాహకులు
- సక్రమంగా నిర్వహించని సేల్ రిజిస్టర్లు, ఇతర రికార్డులు
- ఇటీవల నిర్వహించిన 'ఆపరేషన్ గరుడ'తో అక్రమాలు వెలుగులోకి
- జిల్లాలో 1104 మెడికల్ షాపులు, 18 షాపులపై కేసులు నమోదు



ఇటీవల అనకాపల్లిలో ఓ మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

యలమంచిలి రూరల్: ఉమ్మడి జిల్లాలో ఔషధ దుకాణాల్లో అక్రమాలను వెలికితీయడానికి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఔషధ నియంత్రణ శాఖల అధికారులు సంయుక్తంగా ఆపరేషన్ గరుడ పేరిట ఇటీవల చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో అనేక అక్రమాలు వెలుగు చూశాయి. ప్రజలకు ఎలాంటి జబ్బు వచ్చినా మొదట గుర్తుకు వచ్చేది మందుల దుకాణాలు. అలాంటి దుకాణాలు ప్రజల అవసరాలను తమ ఆదాయ మార్గాలుగా మలుచుకుంటున్నాయి. అర్హత లేని ఫార్మసిస్టులను నియమించుకుని ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మత్తు, నిద్రకు సంబంధించిన మందులు కూడా వైద్యుడి సిఫార్సు లేకుండానే విక్రయిస్తున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కనిపించని ఫార్మసిస్టులు

జిల్లాలో 1104 మెడికల్ షాపులు ఉన్నాయి. అందులో అర్హత లేకున్నా ఫార్మసీలు నిర్వహిస్తున్న వారు చాలా మంది ఉన్నారు. వాస్తవానికి మెడికల్ షాపు నిర్వహించాలంటే బీ-ఫార్మసీ, ఎం-ఫార్మసీ, డీ-ఫార్మసీ విద్యార్హత అవసరం. అలాంటి సర్టిఫికెట్లు లేకుండానే దుకాణాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న మెడికల్ షాపుల్లో 60 శాతం వరకు ఫార్మసిస్టులు ఉండడం లేదు. మెడికల్ షాపుల్లో మందులు ఇచ్చే వర్కర్లు కూడా ఫార్మసీ చేసి ఉండాలి. కానీ ఫార్మసీ చేయకుండానే..10వ తరగతి, ఇంటర్ చదివి, కొద్దో గొప్పో ట్యాబ్లెట్ల గురించి జ్ఞానం ఉన్నవారు ఫార్మసిస్టులుగా చలామణి అవుతున్నారు. చాలా దుకాణాల్లో ఫార్మసీ సర్టిఫికెట్ల దందా నడుస్తోంది.

అద్దె సర్టిఫికెట్లతో దందా...

మెడికల్ షాపుల్లో దాదాపు 50 శాతం అద్దె సర్టిఫికెట్లతో కొనసాగుతున్నాయి. ఫార్మసీ పట్టా పొందినా ఉద్యోగాలు రాకపోవడంతో వారి పట్టా సర్టిఫికెట్లను అద్దెకు ఇస్తున్నారు. మెడికల్ షాపుల యజమానులు ఒక్కో సర్టిఫికెట్‌కు ఏడాదికి దాదాపు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు అద్దెకు తీసుకుంటున్నారు. ఫార్మసిస్టులు ఉన్న దుకాణాల్లో కూడా 95 శాతం మంది ఆప్రాన్ ధరించడంలేదు. సరైన ఉష్ణోగ్రతల్లో మందులు నిల్వ చేయడం లేదు.

గ్రామాల్లో సైతం అర్హత లేకున్నా మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారు. పలువురు మెడికల్ షాపుల యజమానులు బినామీ పేర్లతో దుకాణాలను నిర్వహిస్తున్నారు. కొన్ని మెడికల్ షాపుల్లో కాలం చెల్లిన మందులను నిల్వ చేస్తున్నారు. ఎక్కువ దుకాణాలు లైసెన్సు ఉన్న వారు కాకుండా బినామీలే నిర్వహిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు మాత్రం తనిఖీలను తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. ఔషధ నియంత్రణ అధికారులు, మెడికల్ షాపుల యజమానులతో ఒప్పందాలు చేసుకుని నిబంధనలకు పాతరేస్తున్నారు.

నిత్యం తనిఖీలు చేస్తున్నాం



జిల్లాలోని మందుల దుకాణాల్లో నిత్యం తనిఖీలు చేస్తున్నాం. నిబంధనలు పాటించని మెడికల్ షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో నిబంధనలు పాటించని 18 దుకాణాలపై డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేశాం. మరో 18 దుకాణాల యజమానులపై న్యాయస్థానాల్లో ఛార్జిషీట్లు సైతం వేశాం. మెడికల్ షాపుల యజమానులు నిబంధనలు పాటించకపోతే మా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం. మందుల నాణ్యత, రేటు, కొనుగోళ్లలో సమస్యలు, సందేహాలుంటే 8632330909 నంబరుకు సంప్రదించవచ్చు.

–వి.అభిప్రియ, జిల్లా ఔషధ నియంత్రణ అధికారి, అనకాపల్లి

హెచ్-1 రికార్డు తప్పనిసరి

హెచ్-1 రికార్డు అంటే విలువైన మందులు, మత్తు, నార్కోటిక్స్, యాంటీబయాటిక్స్ మందులు విక్రయించే సమయంలో దుకాణ యజమానులు తప్పనిసరిగా మందులు తీసుకునే వ్యక్తి వివరాలు నమోదు చేయాలి. ఎంత పరిమాణంలో మందులిచ్చారు..మందులు తీసుకోవడానికి సూచించిన వైద్యుడి పేరు, వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ రికార్డు ద్వారా మందులు వినియోగించేవారు సక్రమంగా వినియోగిస్తున్నారా? లేదా? అన్న వివరాలు తెలుసుకోవచ్చు. ప్రతి మందుల దుకాణంలోను ఈ రికార్డు తప్పనిసరిగా నమోదు చేయాలి. కానీ చాలా దుకాణాల్లో ఈ రికార్డుల నిర్వహణలో పలు లోపాలున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన కొందరు దగ్గుకు వాడే సిరప్‌లు తాగేస్తున్నారు. కోరెక్స్, పెన్సిడ్రిల్ వంటి ఔషధాలు కొంత మత్తును కలిగిస్తాయి. ఆల్కహాల్, ఇతర మత్తు పదార్థాలకు బానిసైన వారు అవి దొరకని సమయాల్లో మెడికల్ సిరప్‌లను వాడుతున్నారు.

పరిహారం తేలకుండా కంపెనీలకు స'పోర్టు'

- నిర్వాసితులను మోసగించిన కూటమి ప్రభుత్వం
- కేబినెట్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం
- అఖిలపక్ష రైతుల ఆగ్రహం



డీఎల్‌పురంలో నిరసన వ్యక్తం చేస్తున్న అఖిల పక్ష రైతులు, నాయకులు

నక్కపల్లి: మండలంలో ఏపీఐఐసీ వారు సేకరించిన భూములకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం, ప్యాకేజీ చెల్లించకుండా డీఎల్‌పురం సమీపంలో పోర్టు ఎలా నిర్మిస్తారని అఖిలపక్ష రైతులు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం డీఎల్‌పురంలో వారు నిరసన వ్యక్తం చేశారు. మండలంలో రాజయ్యపేట సమీపంలో ఏర్పాటు చేయబోయే ఆర్సిలర్ మిట్టల్ నిప్పన్ ఇండియా స్టీల్‌ప్లాంట్ ఎగుమతులు దిగుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం క్యాపిటల్ పోర్టు ఏర్పాటు చేయాలని గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం పట్ల సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, డీఎల్‌పురం సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు 2200 ఎకరాలు భూములు కేటాయించారని, ఇప్పటి వరకు రైతులకు సంబంధించి నష్ట పరిహారం, ప్రత్యేక ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించలేదన్నారు. నిర్వాసితులకు పునరావాసం కూడా కల్పించలేదన్నారు. 2013 భూసేకరణ చట్టప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని అప్పట్లో టీడీపీ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చేక రైతులను మోసం చేసిందని ఆరోపించారు. రైతులనుంచి కారు చౌకగా భూములు లాక్కొని, ప్రైవేటు సంస్థలకు విక్రయించారన్నారు. రైతులకు న్యాయపరమైన నష్టపరిహారం చెల్లించకుండా కంపెనీల కోసం ప్రభుత్వమే పోర్టు నిర్మించాలని సిద్ధపడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంటు కోసం ఆగమేఘాల మీద అన్ని సదుపాయాలు కల్పిస్తున్న కూటమి ప్రభుత్వానికి భూములు త్యాగం చేసిన రైతులు, నిర్వాసితులు, చేతివృత్తుల వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించే ఆలోచన రాకపోవడం దుర్మార్గమన్నారు. సాగు భూములకు, డీఫారం భూములకు పరిహారం పూర్తిగా చెల్లించలేదన్నారు. పర్యావరణ నిబంధనలు పాటించకుండా ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండా, గ్రామసభలు ఏర్పాటు చేయకుండా ఏకపక్షంగా స్టీల్‌ప్లాంటు పనులు ప్రారంభించడం దారుణమన్నారు. ప్రతి సెంటుకు, ప్రతి చెట్టుకు, నష్టపరిహారం చెల్లించిన తరువాతే పనులు ప్రారంభించాలన్నారు. స్టీల్‌ప్లాంటు కోసం పోర్టు ఏర్పాటు చేయాలని రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. డీఎల్‌పురంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, మండల కార్యదర్శి రాజేష్, కె.ప్రసాద్, బి.రాము, ఎల్. సూర్యారావు, తాతీలు, కృష్ణ అప్పారావు , చిరంజీవి, జి.గోవిందు పాల్గొన్నారు.

మహిళా సిబ్బందికి చెక్‌పోస్టు విధులు

- నదుపాయాలు, రక్షణ లేని చోట డ్యూటీలు
- నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో సిబ్బంది ఆధిపత్య పోరు



రాజుపేట అబ్జర్వేషన్ చెక్‌పోస్టులో విధులు నిర్వర్తిస్తున్న మహిళా సిబ్బంది

నర్సీపట్నం: నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో సిబ్బంది మధ్య ఆధిపత్య పోరు నడుస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు పది నెలలు కావస్తున్నా చైర్మన్ నియామక ప్రక్రియ పూర్తి కాలేదు. దీంతో సెక్రటరీతోనే పాలన నడుస్తుంది. సెక్రటరీకి విధేయులైన సిబ్బందిలో ఒకరిద్దరు కనుసన్నల్లోనే కార్యాలయ పరిపాలన సాగుతుంది. కార్యాలయంలో జరుగుతున్న లొసుగులు ఎక్కడ బయటపడతాయోనని కార్యాలయంలో పని చేసే మహిళా సిబ్బందిని చెక్‌పోస్టుల్లో నియమించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్ యార్డు పరిధిలో మూడు చెక్‌పోస్టులు ఉన్నాయి. బలిఘట్టం, గన్నవరం చెక్‌పోస్టుల ద్వారా మార్కెట్ యార్డుకు ఆదాయం సమకూరుతుంది. రాజుపేటలో ఉన్న అబ్జర్వేషన్ చెక్‌పోస్టు ద్వారా పైసా ఆదాయం రాదు. విధేయులుగా ఉండే వారిని ఆదాయం వచ్చే చెక్ పోస్టుల్లో వేసుకుని, 17 కిలోమీటర్ల దూరంలో అబ్జర్వేషన్ చెక్‌పోస్టులో మహిళా సిబ్బందిని నియమించారు. ఈ చెక్‌పోస్టులో కనీసం గేటు కూడ లేదు. ఒకరిద్దరు ఒత్తిడితో సెక్రటరీ వేసిన డ్యూటీలు వివాదాస్పదంగా మారాయి. కార్యనిర్వాహణ అధికారి మహిళే అయినప్పటికీ మహిళా సిబ్బందికి ఆదరణ కరువైంది. సెక్రటరీ తీసుకున్న నిర్ణయంతో చెక్‌పోస్టులో కాలకృత్యాలు తీర్చుకునేందుకు కనీస సదుపాయాలు లేక మహిళా సిబ్బంది ఊపిరి బిగపట్టుకొని విధులు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో సెక్రటరీతో పాటు ఎనిమిది మంది సెక్యూరిటీ గార్డులు, ఇద్దరు వాచ్‌మన్‌లు, కంప్యూటర్ ఆపరేటర్ విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యాలయంలో పని చేసే మహిళా సిబ్బంది మంగ, విజయ్‌ను ఎక్కడో దూరంగా ఉన్న అబ్జర్వేషన్ చెక్‌పోస్టులో వేశారు. సన్నిహితంగా ఉండే వారికి ఆదాయం, దగ్గరగా ఉండే చెక్‌పోస్టుల్లో విధులు అప్పగించారు. ఇంత వరకు ఎన్నడూ మహిళా సిబ్బందికి చెక్‌పోస్టు విధులు కేటాయించలేదు. రాష్ట్రంలో ఏ మార్కెట్ యార్డులో లేని విధంగా మహిళా సిబ్బందికి చెక్‌పోస్టు విధులు అప్పగించారని ఆ శాఖలో పనిచేసే సిబ్బంది చెబుతున్నారు. సెక్రటరీ తీసుకున్న నిర్ణయంతో మహిళా సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై మార్కెట్‌యార్డు సెక్రటరీ భువనేశ్వరిని వివరణ కోరగా కావాలని మహిళా సిబ్బందికి చెక్‌పోస్టు విధులు అప్పగించలేదని, వారు చేస్తానంటే డ్యూటీలు వేశానని అన్నారు. శనివారం సిబ్బందికి మీటింగ్ ఏర్పాటు చేసి, మహిళా సిబ్బందికి చెక్‌పోస్టు విధులను మార్పు చేస్తానని తెలిపారు.

త్వరలో ప్రభుత్వోద్యోగులకు క్రీడా పోటీలు


- ప్రతి మండల ప్రధాన కేంద్రంలో వాలీబాల్ కోర్ట్
- కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల: ప్రతి మండల ప్రధాన కేంద్రాల్లో వాలీబాల్ కోర్ట్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సంబంధిత అధికారులు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి జిల్లా క్రీడల అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో క్రీడాలను ప్రోత్సహించి, మంచి క్రీడాకారులను తయారు చేయాలని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, క్రీడాస్ఫూర్తి అలవడుతుందన్నారు. క్రీడాస్ఫూర్తి ద్వారా విద్యార్థులు తమ నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలను తేలికగా అధిగమించగలరని వివరించారు. చోడవరం నియోజకవర్గంలో గాంధీగ్రామ్ ప్రభుత్వ పాఠశాలలో వాలీబాల్ కోర్ట్, లాంగ్ జంప్ పిట్ పూర్తి అయ్యిందని, యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో వాలీబాల్ కోర్ట్ ఫైర్ ఆఫీస్ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేయుటకు కమిటీ నిర్ణయించిందని తెలిపారు. త్వరలో ప్రభుత్వం ఉద్యోగులకు నిర్వహించబోయే జిల్లా స్థాయి క్రీడా పోటీలకు తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో 2 అవుట్ డోర్ బ్యాడ్మింటన్ కోర్టల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో వాలీబాల్ కోర్ట్ , బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో క్రీడాకారులు, క్రీడలు ఆడే విద్యార్థుల వివరాలు, మండల, గ్రామ స్థాయిలో క్రీడాకారులకు సంబంధించిన మౌలిక సదుపాయాల వివరాల పూర్తి నివేదికను రూపొందించి తదుపరి సమావేశానికి తీసుకురావాలని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎల్.వెంకటరమణ, పంచాయతీ రాజ్ ఈఈ వీరునాయుడు, ఏపీఐఐసీ ప్రాజెక్ట్ ఇంజినీర్ సత్యంరాజు, సమగ్ర శిక్ష ఏపిసి నరసింహమూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ యాజమన్యాల పరిధిలో పనిచేస్తున్న ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా విడుదల చేసినట్టు విశాఖ డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ గురువారం తెలిపారు. వీటి ఆధారంగానే త్వరలో పదోన్నతులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 10వ తేదీ వరకు డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

30.46 ఎకరాల డీపట్టా భూమి ప్రభుత్వానికి అప్పగింత



భూమిపత్రాలతో పాటు అంగీకార పత్రాన్ని కలెక్టర్ విజయకృష్ణన్‌కు అందిస్తున్న రాజేశ్వరరావు

తుమ్మపాల: బుచ్చయ్యపేట మండలం ఆర్.భీమవరం రెవెన్యూ పరిధిలో 30.46 ఎకరాల డి-పట్టా భూములపై తమకు గల హక్కులను వదులుకుంటూ లిఖితపూర్వక సమ్మతిని కలెక్టర్ విజయ కృష్ణన్‌కు అందించినట్టు గాజువాక మండలం కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన వ్యాపారవేత్త (భూమి యాజమాని) కడియాల రాజేశ్వరరావు తెలిపారు. గ్రామంలో రైతులకు ప్రభుత్వం అందించిన డీ-పట్టా భూమి కొన్నేళ్ల క్రితం కొనుగోలు చేయగా అటువంటి కొనుగోలు చెల్లదని తెలుసుకుని ప్రభుత్వానికి అందించినట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వ అవసరాలకు వినియోగించేందుకు తమకు గల రిజిస్టర్డ్ పత్రాలు ఎటువంటి ఆటంకం లేకుండా శాశ్వతంగా హక్కును వదులుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి భూమి రిజిస్టర్డ్ పత్రాలతో పాటు భూమిని వదులుకున్నట్టు అంగీకార పత్రాన్ని కూడా ఆమెకు అందించారు. బుచ్చెయ్యపేట మండలం, ఆర్.భీమవరం గ్రామానికి చెందిన శివారు గ్రామమైన చిన భీమవరం సర్వే నంబర్లు 223/2, 224, 226/1, 227/1, 227/2, 128లలో 1984 కి ముందు ఆరుగురు రైతులకు ప్రభుత్వం కేటాయించిన భూమి క్రయ దస్తావేజులు 3048/94, 3047/94, 3046/94, 777/95, 1694/95, 2648/96, చోడవరం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయబడ్డాయని, రైతుల పేరున పట్టాదారు పాసు పుస్తకాలు కలగడంతో తాము కొనుగోలు చేసినప్పటికీ ప్రస్తుతం 22(ఎ)లో నమోదై ఉండడం, సదరు వ్యవహారాలు అనధికారికం అని తెలుసుకున్నామన్నారు. దీంతో సదరు భూమిని ప్రభుత్వానికి అప్పగించడం ద్వారా ప్రభుత్వ అవసరాలకు వినియోగించేలా చూడాలని ఆయన కోరారు.

యాప్‌లతో వేగలేకపోతున్నాం

ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు పనికి తగిన వేతనం, పారితోషికం, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం తమపై పనిభారం పెంచుతోందని అంగన్‌వాడీ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త కొత్త యాప్‌లను తమపై రుద్ది సాంకేతిక సమస్యలు ఉన్నప్పటికీ వాటి ఆధారంగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం పంపిణీ చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని వాపోతున్నారు. నక్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి అధ్యక్షతన వర్కర్లు సమావేశమై ప్రభుత్వం తెచ్చిన కొత్త యాప్‌లతో తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు.



కొత్త యాప్‌లతో ఇబ్బంది పడుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న వర్కర్లు

- బాలసంజీవని 2.0 వెర్షన్‌తో ఇబ్బంది
- అంగన్‌వాడీ ఉద్యోగుల మానసిక ఆవేదన
- పనిభారంతో తీవ్రమైన ఒత్తిడి



బాలసంజీవని కొత్త వెర్షన్‌తో యాప్



అంగన్‌వాడీ వర్కర్ల వద్ద గల ఫోన్‌లోని యాప్‌లు

నక్కపల్లి: కూటమి ప్రభుత్వం వచ్చాక అంగన్‌వాడీ కార్యకర్తలపై పనిభారం మరింత పెరిగింది. తాజాగా ప్రవేశపెట్టిన పలు యాప్‌లు తమకు ఇచ్చిన మొబైల్ ఫోన్‌లలో ఇన్‌స్టాల్ కాక నరక యాతన పడుతున్నామని, సాంకేతిక సమస్యలు పరిష్కరించకుండా యాప్‌ల ద్వారానే సరుకులు పంపిణీ చేయాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం పట్ల అంగన్‌వాడీ వర్కర్లు ఆవేదన, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పోషణ ట్రాకర్, ఎఫ్‌ఆర్‌ఎస్, యాప్ ద్వారా లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ చేస్తున్నారు. లబ్ధిదారుల ఫొటో క్యాప్చర్ చేసి సరుకులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఫోన్‌లో సాంకేతిక సమస్య తలెత్తినా, నెట్‌వర్క్ లేక పోయినా లబ్ధిదారు ఫొటో క్యాప్చర్ కాక సరుకులు ఇవ్వడానికి వీలు పడడం లేదన్నారు. తమకు ఇచ్చిన ఫోన్‌లలో కొన్ని యాప్‌లు ఇన్‌స్టాల్ కావడం లేదని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించకుండా తాజాగా కూటమి ప్రభుత్వం బాల సంజీవని 2.0 వెర్షన్‌తో కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ యాప్‌లో వర్కర్, హెల్పర్, ఫొటో క్యాప్చర్ చేసి లబ్ధిదారు గర్భిణీ, బాలింత, 7-3 వయసు కలిగిన, అలాగే 3-6 సంవత్సరాలు వయసు కలిగిన పిల్లల ఫొటోలు కూడా క్యాప్చర్ చేసి బాలసంజీవని పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే పలు సాంకేతిక సమస్యలతో పోషకాహారం పంపిణీకి నానా ఇబ్బందులు పడుతున్న తమపై కొత్త యాప్‌లు తీసుకువచ్చి ఇబ్బంది పెట్టడం ఎంత వరకు సమంజసమని వర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సరుకుల పంపిణీ అంతా ఆన్‌లైన్ విధానంలోనే చేయాల్సి ఉంటుంది. ఒక పనిని 3 యాప్‌లలో అప్లోడ్ చేయాల్సి వస్తోంది. యాప్‌లతో ఇబ్బంది పడుతూనే ప్రీ స్కూలు విద్యార్థులకు బోధన, పోషకాహారం తయారు చేసి పెట్టడం వంటి విధులు నిర్వహించాల్సి వస్తుందన్నారు.

పనిభారం..అరకొర వేతనం

ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు పిల్లల బరువును పరిశీలించాలని, రికార్డ్స్ రాయడం, టేక్ హోమ్ రేషన్ పంపిణీ, యాప్‌ల ద్వారా ప్రభుత్వం కోరిన సమాచారం ఇవ్వడం వంటి విధులు నిర్వహిస్తున్నామని, పెన్షన్ల పంపిణీ కార్యక్రమం కూడా తమపైనే రుద్దుతున్నారని తెలిపారు. హెల్పర్లు కేంద్రాన్ని శుభ్రం చేయడం, పోషకాహారాన్ని వండి పెట్టడం, గిన్నెలు శుభ్రం చేయడం, పిల్లల వాష్‌రూములు శుభ్రపరచడం వంటి పనులు చేస్తున్నారని, వీరికి కేవలం రూ.7వేలు వేతనం మాత్రమే ఇస్తున్నారన్నారు. రోజంతా పనిభారంతో ఒత్తిడికి గురవుతున్న వర్కర్లకు రూ.11,500 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు చేసే పని తమతో చేయిస్తున్నప్పటికీ వేతనాలు మాత్రం సమానంగా ఇవ్వడం లేదని వర్కర్లు వాపోతున్నారు. బాలసంజీవని యాప్‌ను సవరణ చేయాలని, సమాన వేతనాలు అమలు చేయాలని, గ్రామాల్లో పింఛన్ల బట్వాడా నుంచి అంగన్‌వాడీ సిబ్బందిని మినహాయించాలని, పనిభారం తగ్గించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కొత్త టెక్నాలజీతో కూడిన 5జీ మొబైల్ ఫోన్లు అందజేయాలని, ఇంటర్‌నెట్ ఛార్జీలు చెల్లించాలని కోరుతున్నారు.

- అనకాపల్లి జిల్లాలో 9 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి.
- వాటి పరిధిలో సుమారు 1807 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి.
- వీటిలో 3600 మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పనిచేస్తున్నారు.
- వర్కర్‌కు రూ.11,500, హెల్పర్‌కు రూ.7000 వేలు వేతనం చెల్లిస్తున్నారు...

సాంకేతిక ఇబ్బందులతో విధులు ఎలా...

మేము ప్రభుత్వం అప్పగించే విధులు చేయడానికి వ్యతిరేకం కాదు. కానీ సక్రమంగా పని చేయని ఫోన్‌లతో ఆన్‌లైన్‌లో సరుకులు ఇవ్వాలనడం సరి కాదు. ప్రభుత్వ ఉద్యోగి చేస్తున్న పనులన్నీ మా చేత చేయిస్తూ సమాన వేతనం ఇవ్వకపోవడం దారుణం. కొత్తగా ప్రవేశపెడుతున్న బాలసంజీవని 2.0 వెర్షన్ ప్రస్తుతం మా వద్ద ఉన్న ఫోన్‌లలో పనిచేయదు. నెట్‌వర్క్ సరిగ్గా ఉండదు. ఇంటర్నెట్ సదుపాయం లేకపోతే యాప్‌లు ఓపెన్‌కావు. ఇన్ని ఇబ్బందులతో పనిచేయం కష్టంగా ఉంది. అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంతో పాటు, కొత్త మొబైల్‌ఫోన్‌లను సమకూర్చాలి.

–దుర్గారాణి, అంగన్‌వాడీ వర్కర్ యూనియన్ అధ్యక్షురాలు



అంగన్‌వాడీ కేంద్రం

క్లుప్తంగా

టెన్త్ విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు


విద్యార్థిని సాయి సంజన

రావికమతం: జెడ్.కొత్తపట్నం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని బొబ్బిలి సాయి సంజన (16) అదృశ్యంపై తండ్రి బొబ్బిలి రాజు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. సాయి సంజన (16) జెడ్.కొత్తపట్నం హైస్కూల్లో పదో తరగతి చదువుతోంది. కొత్తకోట హైస్కూల్లో పబ్లిక్ పరీక్షలు రాసింది. ఈ నెల 1వ తేదీన (మంగళవారం) చివరి పరీక్ష రాసి ఇంటికి వచ్చింది. అయితే మంగళవారం రాత్రి నుంచి ఆమె కనిపించకపోవడంతో స్నేహితులను, బంధువులను ఆరా తీశారు. ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

6.5 తులాల బంగారం చోరీ


చోరీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ క్లూస్ టీం

గొలుగొండ: చోద్యం గ్రామంలో బుధవారం రాత్రి 6.5 తులాల బంగారం చోరీకి గురైంది. గ్రామానికి చెందిన బొందల రాజు బుధవారం రాత్రి 10 గంటల సమయంలో సమీప గ్రామం లింగపేటలో తీర్థమహోత్సవాలు వెళ్లి తిరిగి ఇంటికి 12 గంటలకు తిరిగి వచ్చి చూడగా తలుపులు పగులకొట్టి ఉన్నాయి. ఇంట్లో 6.5 తులాల బంగారం అపహరణకు గురైందని బాధితుడు కృష్ణదేవిపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నర్సీపట్నం డీఎస్పీ పి. శ్రీనివాసరావు, క్లూస్ టీం సభ్యులు, నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వరరావు గురువారం ఉదయం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దర్యాప్తు చేపట్టారు.

లక్ష్యానికి మించి ఉపాధి కల్పన

- 124.67 లక్షల పనిదినాలు పూర్తి
- కలెక్టర్ విజయ కృష్ణన్


అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన 120 లక్షల పని దినాల లక్ష్యాన్ని అధిగమించి 124.67 లక్షల పని దినాలను వేతనదారులకు కల్పించడం ద్వారా రాష్ట్రంలో 6వ స్థానంలో జిల్లా నిలిచిందని కలెక్టరు విజయ కృష్ణన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లా అధికారులు, మండల అభివృద్ధి అధికారులతో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేపడుతున్న సర్వేలు, ఎస్.డబ్ల్యూపిసి.షెడ్లు, హౌసింగ్, గ్రామీణ నీటి సరఫరా, ఉపాధి హామీ, చలివేంద్రాల ఏర్పాటు వంటి అంశాలపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు లక్ష్యానికి మించి పని దినాలు కల్పించడం ద్వారా రూ.350 కోట్లు వేతనాల రూపంలో లబ్ధి పొందారని, కూలీలకు సగటు రోజువారీ వేతనంగా రూ.281 చెల్లించి రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచామన్నారు. మెరుగైన పనితీరుతో 2025–26 ఆర్థిక సంవత్సరానికి 127 లక్షల పని దినాల లక్ష్యం అధిగమించి మొదటి స్థానంలో నిలిచేందుకు అధికారులు కృషి చేయాలన్నారు.

2024–25లో రూ.516.65 కోట్లు వ్యయం చేయగా దానిలో వేతనం ఖర్చు రూ.350.29 కోట్లు, మెటీరియల్ ఖర్చు రూ.154.79 కోట్లు, అడ్మినిస్ట్రేషను ఖర్చు రూ.11.57 కోట్లుగా ఉందన్నారు. ఉపాధి పథకంలో 1,648 రైతులకు చెందిన 1,830 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టడం ద్వారా లబ్ధి పొందారని, 120 ఎకరాల ప్రభుత్వ భూముల్లో కొబ్బరి మొక్కలు నాటడం జరిగిందన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో 745 గోకులం షెడ్లు, రూ.181.22 కోట్లతో 229.09 కిలోమీటర్ల సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, రూ.24.95 కోట్లతో 308 పాఠశాలలకు ప్రహరీల నిర్మాణం, రూ.1.67 కోట్లతో 89 నర్సరీలు, రూ.13 కోట్లతో 44 పట్టు పరిశ్రమ పనులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రోడ్డు సదుపాయాలు లేని 17 గిరిజన ఆవాసాలకు రూ.21.89 కోట్లతో 22.18 కిలోమీటర్ల రోడ్డును మంజూరు చేయడం జరిగిందన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి 127 లక్షల పని దినాలు, పశువులకు నీటి తొట్టెలు 215, పంట సంజీవని 7,200, పంట కాలువల పునరుద్ధరణ 451.50 కిలోమీటర్లు, చెరువుల సమగ్ర అభివృద్ధి 977 పనులను మంజూరు చేసి, పనులన్నింటిని ఈ నెల 1 నుంచి ప్రారంభించామన్నారు.

వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు

జిల్లాలో మంచినీటి ఎద్దడి రాకుండా కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకుని, చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీలో కనీసం ఒక చలివేంద్రం, ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట్ల అదనంగా ఏర్పాటుచేయాలన్నారు. బోర్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. హౌసింగ్‌కు అదనపు సహాయం లబ్ధిదారుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని, వెంటనే ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. జూన్ నాటికి 7,200 ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాన్నారు.

ఎంపిక చేసిన గ్రామాల్లో సోలార్ యూనిట్లు

మోడల్ గ్రామాలుగా గుర్తించిన కశింకోట మండలం బయ్యవరం, సబ్బవరం మండలం గుల్లేపల్లి, మునగపాక మండలం తోటాడ, ఎస్.రాయవరం మండలం గుడివాడ, గొలుగొండ మండలం గొలుగొండ గ్రామాలలో పీఎం సూర్యఘర్ పథకం అమలు పురోగతిని సమీక్షించారు. సోలారు యూనిట్ ఏర్పాటుకు ఉచిత దరఖాస్తుతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీ, బ్యాంకు రుణం మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతి ఇంటికీ 1 కె.వి. సోలారు యూనిట్ ఏర్పాటు చేసుకొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి, లీడ్ బ్యాంకు మేనేజరు కె.సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, మండల అభివృద్ధి అధికారులు, మోడల్ గ్రామాల సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు.

సమీకృత సాగు రైతులకు మేలు

డీఆర్‌డీఏ పీడీ శచీదేవి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

నర్సీపట్నం: సమీకృత సాగు విధానంతో రైతులు ఆర్థికంగా లాభపడవచ్చునని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శచీదేవి పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సమీకృత వ్యవసాయ విధానంపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సమీకృత వ్యవసాయ వ్యవసాయం ప్రధాన లక్ష్యం సాగు పశుపోషణ, చేపల ఉత్పత్తి, పౌల్ట్రీ తదితర ఉత్పాదకతను పెంచడమే కాకుండా వీటి వల్ల ప్రతి రోజు ఆదాయం సమకూరుతుందన్నారు. సమీకృత వ్యవసాయ విధానంలో విభిన్న రకాల పంటలను పండించడం, అనేక రకాల జంతువులను పెంచడం ద్వారా రైతులు ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చు అన్నారు. వాతావరణ మార్పుల వల్ల ఒకటి లేదా రెండు పంటలను కోల్పోయినప్పటికీ మిగిలిన రకాల పంటలు పశుపోషణ, చేపల పెంపకం తదితర వాటి ద్వారా దాయం పొందడానికి వీలవుతుందన్నారు. కూరగాయలు పెంపకం, గేదెల పెంపకం, తేనె టీగల పెంపకం ద్వారా ఆదాయం సమకూరుతుందన్నారు. ఆయా అనుబంధ సంస్థల ద్వారా రాయితీలు కూడా రైతులు పొందవచ్చన్నారు. ఈ సమావేశంలో డీపీఎం ఎల్‌హెచ్.వరప్రసాద్, ఏసీ సత్యనారాయణ, ఏపీఎంఎఫ్‌పీఓ జగన్నాథం, గొలుగొండ, నాతవరం ఏపీఎం రమణ కుమారి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

లేటరైట్ అనుమతులు రద్దు చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు

నర్సీపట్నం: లేటరైట్ అనుమతులు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాతవరం మండలం, సుందరపుకోట పంచాయతీ బమిడిక లొద్దులో గత ప్రభుత్వంలో తవ్వకాలు జరిగితే వ్యతిరేకించిన టీడీపీ కూటమి నాయకులు అధికారం చేపట్టిన తర్వాత తవ్వకాలకు సిద్ధపడడం దుర్మార్గమైన చర్య అన్నారు. లేటరైట్ తవ్వకాలు చేపడితే బమిడికలొద్దు ప్రాంతంలో తరతరాలుగా జీడిమామిడి పంటలు వేసుకుని జీవనం సాగిస్తున్న గిరిజనులు ఉపాధి కోల్పోతారన్నారు. అటవీ సంపద దెబ్బతింటుందని, సరుగుడు ప్రాంతంలోని జలపాతం పూర్తిగా కనుమరుగవుతుందని అన్నారు. షెడ్యూల్ ఏరియాలో ఉన్నందున గిరిజన చట్టాలకు, పీసా చట్టాలకు తూట్లు పొడుస్తూ గిరిజన మనుగడే ప్రశ్నార్థకమవుతుందన్నారు. బినామీ పేర్లతో ఇచ్చిన లేటరైట్ తవ్వకాల అనుమతులు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన చట్టాలను, గిరిజనుల మనుగడను కాపాడాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు పాల్గొన్నారు.

త్వరలో బంగారమ్మపాలెం నుంచి చేపలవేట బంద్!


మత్స్యకారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌డీసీ మనోరమ

ఎస్.రాయవరం: బంగారమ్మపాలెం మొగ నుంచి ఇకపై వేట నిషేధం ఉంటుందని, మత్స్యకారులు సహకరించి ప్రత్యామ్నాయం దొండవాక రేవు నుంచి వేట చేసుకునే ఏర్పాటు చేస్తున్నామని నేవల్‌బేస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ అన్నారు. బంగారమ్మపాలెం గ్రామంలో మత్స్యకార పెద్దలతో గురువారం అత్యవసర సమావేశం నిర్వహించారు. గ్రామానికి శరవేగంగా నిర్మాణం కాబోతున్న నేవల్ బేస్ అనుసంధానంగా శారదా, వరహానదుల కలయిక మార్గం నుంచి కొనసాగే మత్స్యవేటను మరికొన్ని రోజుల్లో నిలిపి వేసే చర్యలు ఉంటాయని సమావేశంలో వెల్లడించారు. దీంతో గ్రామస్తులు చేపల వేటకు దారి మూసేస్తే, తమ గ్రామానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న దొండవాక వెళ్లి ఎలా వేట చేసుకుంటామని ప్రశ్నించారు. మా గ్రామం ఒక చోట, వేట మరో చోట ఎలా సాధ్య పడుతుందని అన్నారు. అసలు మా గ్రామం తరలించే ఆలోచన ఉందా? ఉంటే ,ఎక్కడికి తరలిస్తారో స్పష్టంగా చెప్పి తమకు ఉపాధి చూపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు నివేదిస్తామని అధికారులు చెప్పారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రమేష్‌బాబు, ఎస్ఐ విభీషణరావు, సర్పంచ్ చోడిపల్లి శ్రీనివాసరావు, మత్స్యకార సంఘ నాయకులు పాల్గొన్నారు.

కారు ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి

కశింకోట: కశింకోట వద్ద జాతీయ రహదారిపై ఆర్ఈసీఎస్ ప్రధాన కార్యాలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. సీఐ అల్లు స్వామినాయుడు అందించిన వివరాల ప్రకారం..బయ్యవరం గ్రామానికి చెందిన పెదపాటి వెంకటరావు (52) కశింకోట సమీపంలోని సంపతిపురం వద్ద ఒక ప్రైవేటు పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. విధి నిర్వహణకు తన గ్రామం నుంచి బుధవారం రాత్రి సైకిల్‌పై పరిశ్రమకు వెళుతుండగా వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన వెంకటరావును గ్రామస్తులు చూసి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. తెలిపారు. మృతునికి ఇద్దరు పిల్లలున్నారు.

నర్సీపట్నం ఆస్పత్రికి అంబులెన్స్ కోసం ఎన్టీపీసీ విరాళం


జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు చెక్కు అందిస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్ శర్మ

పరవాడ: నర్సీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలను మెరుగుపర్చడానికి వీలుగా అంబులెన్స్ ఏర్పాటుకు సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం రూ.35 లక్షల విరాళాన్ని ప్రకటించింది. విరాళాన్ని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) సమీర్‌శర్మ అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ విజయ కృష్ణన్‌కు గురువారం అందించారు. ఈ సందర్భంగా సంస్థ ఈడీ సమీర్‌శర్మ మాట్లాడుతూ సింహాద్రి ఎన్టీపీసీ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రతకు అవసరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. 2020 నుంచి మొబైల్ యూనిట్ ద్వారా మండలంలో 79 గ్రామాల్లో 75 వేల మంది ప్రజలకు ఉచిత వైద్య సేవలు, మందులు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 300 మందికి పైగా రోగులకు కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించడంతోపాటు, దాదాపు 3 వేల మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. సమాజానికి సకాలంలో వైద్య సాయం అందించడమే లక్ష్యంగా ఆస్పత్రికి అంబులెన్స్‌ను అందించామన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కుమారుడి మృతితో తల్లి ఆత్మహత్య


మృతురాలు గౌరి (ఫైల్)

నర్సీపట్నం: కుమారుడు మృతితో మానసిక క్షోభకు గురైన తల్లి ఆత్మహత్య చేసుకుందని పట్టణ సీఐ జి.గోవిందరావు తెలిపారు. పాత బస్టాండ్ ప్రాంతానికి చెందిన కోన గౌరి(50) చిన్న కుమారుడు 15 రోజుల క్రితం ఆకస్మికంగా మృతిచెందాడు. కుమారుడి మృతితో తల్లి గౌరి మానసిక క్షోభకు గురై తీవ్ర మనస్థాపంతో ఈ నెల 2న ఇంటి నుంచి వెళ్లిపోయింది. గురువారం ఉద యం బలిఘట్టం ఉత్తరవాహిని నది లో ఆమె శవమై కనిపించింది. ఈ ఘటనపై మృతురాలు పెద్ద కుమారుడు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

లంచం డిమాండ్ చేస్తే కఠిన చర్యలు

- పనుల కోసం దళారులను ఆశ్రయించవద్దు
- సాక్షి కథనంపై స్పందించిన తహసీల్దార్ నర్సింహమూర్తి



నక్కపల్లి: రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించడం కోసం రైతుల నుంచి తమ సిబ్బంది, వీఆర్వోలు గానీ లంచాలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రేగుల గెడ్డ నర్సింహమూర్తి హెచ్చరించారు. గురువారం 'ప్రతి పనికి పైసా వసూల్' అనే శీర్షికన సాక్షి దిన పత్రికలో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. మ్యుటేషన్లు, పట్టాదారు పాసుపుస్తకాలు, సర్వేల కోసం వివిధ ధ్రువపత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే వారు నేరుగా తనను కలవొచ్చన్నారు. మీరు చేసిన దరఖాస్తులకు సకాలంలో పరిష్కారం కాకపోయినా సిబ్బంది లేదా వీఆర్వోలు, సర్వే సిబ్బంది లంచం డిమాండ్ చేసినా నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రభుత్వం తమకు వేలాది రూపాయల జీతాలు చెల్లిస్తోందని, పైసా తీసుకోకుండా ప్రజలకు పనిచేయడం కోసమే తమను నియమించిందన్నారు. అన్ని సక్రమంగా ఉంటే సకాలంలోనే రైతుల సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఇటీవల కాలంలో బోరు మంజూరు కోసం రైతు నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఆర్ఐ వ్యవహారం జరిగిన తర్వాత వీఆర్వోలు, సిబ్బంది, సర్వే సిబ్బందితో సమావేశం నిర్వహించి గట్టిగా వార్నింగ్ ఇవ్వడం జరిగిందన్నారు.

ఆధారాలు పరిశీలించాకే మ్యుటేషన్...

వేంపాడులో సర్వే నెంబరు 276/1లో 7 ఎకరాల భూమికి సంబంధించి వెబ్‌ల్యాండ్‌లో అక్రమంగా నమోదు చేయలేదన్నారు. 2014లోనే వెబ్‌ల్యాండ్‌లో నమోదు కావడంతో సదరు వ్యక్తి థర్డ్ పార్టీకి విక్రయించారన్నారు. ఇరువురికీ నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉందన్నారు. అన్ని ఆధారాలు పరిశీలించిన తర్వాతే మ్యుటేషన్ చేయడం జరుగుతోందని, వీటిలో అవినీతి జరగడం లేదన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో బ్రోకర్ల హవా ఎక్కువగా ఉందన్న ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయన్నారు. కార్యాలయంతో సంబంధం లేని వ్యక్తులు, వీఆర్వోలు, సిబ్బంది కాని వారి వద్దకు పనుల కోసం రైతులు వెళ్లరాదన్నారు. దళారుల ద్వారా పనుల కోసం వస్తే చేసే ప్రసక్తి లేదన్నారు.

మ్యుటేషన్లు, ఎఫ్‌లైన్ పిటీసన్ల కోసం, వివిధ ధ్రువపత్రాల కోసం వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పెండింగ్ లేకుండా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. లంచం వ్యవహారంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. బ్రోకర్ల వ్యవహారంపై ప్రత్యేక దృష్టి పెడతామని అవసరమైతే పోలీసు కేసులు పెట్టడానికైనా వెనుకాడే ప్రసక్తి లేదన్నారు. తమ పేరు చెప్పి బ్రోకర్లు రైతుల నుంచి లబ్ధిదారుల నుంచి లంచం వసూలు చేస్తే తమకు సంబంధం లేదన్నారు. అలా ఎవరైనా డిమాండ్ చేస్తే నేరుగా ఆధారాలతో సహా తన దృష్టికి తీసుకు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రెండు క్వారీ లారీలకు రూ.1.22 లక్షలు జరిమానా

అనకాపల్లి: మండలంలో మార్టూరు క్వారీ నుంచి రాంబిల్లి మండలానికి అధిక లోడుతో వెళుతున్న రెండు క్వారీ లారీలకు రూ.లక్ష 22 వేలు జరిమానా విధించినట్టు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ గురువారం చెప్పారు. పరిమితికి మించి వాహనాల్లో అధికలోడు తీసుకువెళ్లే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఐ తెలిపారు.

ఎంఐజీ ప్లాట్లకు లాటరీ

113 దరఖాస్తుదారులకు ప్లాట్ల నెంబర్లు కేటాయింపు

విశాఖ సిటీ : ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ ఎంఐజీ లేఅవుట్లలో ప్లాట్ల కోసం వచ్చిన దరఖాస్తులకు గురువారం లాటరీ నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో జరిగిన ఈ కార్యక్రమంలో 113 దరఖాస్తుదారులకు ప్లాట్ల నెంబర్లను కేటాయించారు. మధ్య తరగతి ప్రజల కోసం ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ ఎంఐజీ లేఅవుట్లను వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసింది. అనకాపల్లి జిల్లాలోని అడ్డూరు గ్రామంలో 19.99 ఎకరాల విస్తీర్ణంలో 146 ప్లాట్లు, విజయనగరం జిల్లా గరివిడి గ్రామంలో 21.30 ఎకరాల విస్తీర్ణంలో 212 ప్లాట్లు, విశాఖ జిల్లా పాలవలస గ్రామంలో 76.96 ఎకరాల విస్తీర్ణంలో 472 ప్లాట్లను అన్ని మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నారు. ప్రతి లేఅవుట్ మొత్తం ప్లాట్లలో 10 శాతం ప్రభుత్వ ఉద్యోగులకు, 5 శాతం ప్లాట్లను ప్రభుత్వ పెన్షనర్లకు కేటాయించాలని నిర్ణయించారు. ప్రభుత్వ ఉద్యోగస్థులకు కేటాయించిన 10 శాతం ప్లాట్లకు 20 శాతం రాయితీ కూడా అందిస్తున్నారు. లాటరీ ద్వారా మొదటిసారిగా అడ్డూరులో 25 మందికి, గరివిడిలో ముగ్గురికి, పాలవలలో మూడు విడతలు నిర్వహించిన లాటరీలలో 226 ప్లాట్లను కేటాయించారు. మిగిలిన ప్లాట్లకు కూడా ఆసక్తి ఉన్న వారు టీటీటీ.ఝుజీజ్బు ఇట్టీఛి ఇజౌౌి.జీ ౩ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్పా, ప్లానింగ్ అధికారిణి చామంతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కన్నెర్ర చేస్తే ఫ్యూజులు కట్ అవుతాయి

- విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జేఏసీ
- 26 జిల్లాల్లో జేఏసీ కొత్త కమిటీల ఏర్పాటు
- విశాఖలో జరిగిన సమావేశంలో జేఏసీ ఛైర్మన్‌గా ఎం.రమేష్ ఎన్నిక

సాక్షి, విశాఖపట్నం: డిస్కమ్‌ల్లో ఉద్యోగులు, కార్మికులు ఓపిగ్గా ఉన్నారనీ.. ఒక్కసారి కన్నెర్ర చేస్తే మీ ఫ్యూజులు కట్ అయిపోతాయని విద్యుత్ ఉద్యోగుల(ఈపీడీసీఎల్) జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ ఎస్.కృష్ణయ్య, కన్వీనర్ ఎంవీ రాఘవరెడ్డి హెచ్చరించారు. విశాఖపట్నంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) గురువారం సమావేశమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈపీడీసీఎల్‌లో ఉద్యోగుల వ్యతిరేక చర్యలను ఖండిస్తున్నామన్నారు. యాజమాన్యం కార్మికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించకపోతే ఉద్యమ బాట పట్టడం తప్ప మరో మార్గం లేదన్నారు. వివిధ సంఘాల చైర్మన్లు, కన్వీనర్లు మాట్లాడుతూ అన్ని డిపార్ట్‌మెంట్లలో రిక్రూట్‌మెంట్లు జరుగుతున్నాయనీ.. కానీ డిస్కమ్‌ల్లో ఎలాంటి రిక్రూట్‌మెంట్లు నిర్వహించకపోవడం శోచనీయమని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో అదనంగా ఇంక్రిమెంట్లు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వెన్ను చూపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంత పనిచేసినా విద్యుత్ ఉద్యోగులకు ప్రభుత్వం సరైన గుర్తింపు ఇవ్వడం లేదని వాపోయారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌లతో పాటు 26 జిల్లాల్లో జేఏసీ కొత్త కమిటీలు వేసి ఉద్యోగుల కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కమిటీలు పూర్తయిన అనంతరం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు. సమావేశం అనంతరం డిస్కమ్‌లోని అన్ని యూనియన్లు, అసోసియేషన్ల నుంచి జేఏసీని ఎంపిక చేశారు. ఛైర్మన్‌గా ఎం.రమేష్, కన్వీనర్‌గా భూక్యా నాగేశ్వరరావు, కో కన్వీనర్‌గా జోగి నాయుడు, వైస్ ఛైర్మన్‌గా తురగా రామకృష్ణ, ఇతర బీసీ, బహుజన, ఎస్సీ, ఎస్టీ నాయకుల్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.గోపాలరావు, పోలాకి శ్రీనివాసరావు,వి.గణపతి, బి.సాయికృష్ణ, అన్నే శ్రీనివాసకుమార్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెట్రోకు 98 ఎకరాల సేకరణ

- ఇందుకోసం రూ.670 కోట్లు ఖర్చు
- విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్



మహారాణిపేట (విశాఖ): విశాఖ మెట్రో ప్రాజెక్టుకు 98 ఎకరాల భూములు అవసరం ఉందని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. గురువారం తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ 98 ఎకరాల భూముల్లో 46 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, 52 ఎకరాలను ప్రైవేట్ వ్యక్తుల నుంచి సేకరించాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం రూ.670 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచన వేశామన్నారు. పారిశ్రామిక అవసరాల కోసం సుమారు వెయ్యి ఎకరాల వరకు భూసేకరణ చేపడుతున్నామని, ఆనందపురం మండలం పరిధిలో తర్లువాడ, కనమం, బీడిపాలెం, జగన్నాథపురం తదితర గ్రామాల్లో భూములు ఉన్నట్లు వెల్లడించారు. వీటిలో కొన్ని ప్రభుత్వ భూములు ఉండగా.. మరికొన్ని అసైన్డ్ భూములు ఉన్నాయని కలెక్టర్ వివరించారు. విశాఖలో ఐటీ సంస్థలు నెలకొల్పడానికి పలువురు ముందుకు వస్తున్నారని, ప్రభుత్వ అనుమతితో వాటి కార్యకలాపాలు ప్రారంభించడానికి చర్యలు చేపట్టామన్నారు. ఐటీ సంస్థలు ఏర్పాటు చేసేవారికి రాయితీలు ఇస్తామన్నారు. బీచ్‌రోడ్డులో పర్యాటకులను ఆకర్షించే విధంగా బస్సులను ప్రవేశపెట్టే ఆలోచన ఉందన్నారు. విశాఖలో కీలకమైన మత్స్య రంగం ద్వారా రాబడులు పెంచడానికి చర్యలు చేపట్టామన్నారు. జిల్లా స్థూల ఆదాయాన్ని ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి రూ.1.50 లక్షల కోట్లు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ వివరించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమలు, ఇతర సేవా రంగాల ద్వారా 15 శాతం వృద్ధిని నమోదు చేస్తే.. జిల్లా స్థూల ఆదాయం పెంపు సాధ్యమన్నారు. జిల్లాలో 200 హెక్టార్లలో బీడు భూములను వ్యవసాయ భూములుగా మార్పు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కొబ్బరి, మామిడి తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యమిస్తామని కలెక్టర్ వివరించారు.

అంతర్రాష్ట్ర సర్వీసులకు కొత్త బస్సులు

ఆర్ఎం అప్పలనాయుడు


విశాఖ డిపోను పరిశీలిస్తున్న ఆర్ఎం అప్పలనాయుడు

మద్దిలపాలెం (విశాఖ): బస్ డిపోలతో పాటు బస్సులను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన విశాఖపట్నం డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బందితో సమావేశమయ్యారు. విశాఖపట్నం డిపోలో పరిశుభ్రత మరింత మెరుగుపడాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. గురువారం నుంచి భద్రాచలం-విజయవాడ బస్సుల ద్వారా మరింత ఆదాయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖపట్నం డిపో నుంచి దూర ప్రాంతాలకు, అంతర్రాష్ట్ర సర్వీసులకు కొత్త బస్సులు కేటాయించినట్లు చెప్పారు. డ్రైవర్లు, కండక్టర్లు పోటీ తత్వంతో పనిచేసి విశాఖపట్నం డిపోకు మరింత ఆదాయం తీసుకురావాలని పిలుపునిచ్చారు. బస్సుల మరమ్మతులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. బీఎస్ 6 బస్సులకు సంబంధించి సిబ్బందికి కొత్త టెక్నాలజీతో కూడిన టూల్స్ సరఫరా చేస్తామన్నారు. వేసవి కాలంలో సిబ్బంది ఎవరూ వడదెబ్బకు గురికాకుండా ఎప్పటికప్పుడు మజ్జిగ, మంచినీళ్లు తీసుకోవాలన్నారు. బస్ స్టేషన్, డిపోల్లో తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా

మండుతున్న ఎండలతో జాగ్రత్త



పాపయ్యసంతపాలెంలో అవగాహన కల్పిస్తున్న వైద్యుడు జి.విజయ్‌కుమార్

అనకాపల్లి: రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని ప్రజలు అత్యవసర సమయంలో మాత్రమే బయటకు రావాలని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు జి.విజయ్‌కుమార్ సూచించారు. పాపయ్యసంతపాలెం గ్రామంలో వడదెబ్బపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని కాటన్ వస్త్రాలు, లేత రంగు వస్త్రాలు ధరించాలని, అత్యవసర పరిస్థితుల్లో బయటికి వెళ్లాల్సి వస్తే టోపీ, స్కార్ఫ్, గొడుగు పట్టుకొని వెళ్లాలని చెప్పారు. వీలైనంత వరకూ ఇంట్లో లభించే గెంజి, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేటర్ బి.మంగమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.శాంతికుమారి, ఏఎన్ఎం కె.సుమిత్ర, ఆశా వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.

6న సీతారాముల కల్యాణం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గవరపాలెం సంతబయలు పెదరామస్వామి ఆలయంలో ఈ నెల 6న సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం కల్యాణోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం కల్యాణం అనంతరం ఆలయం వద్ద సుమారు 6 వేల మందికి అన్నదానం చేస్తామని, రాత్రికి ఊంజల్ సేవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

వృథాగా పోతున్న తాగునీరు



మూడు గ్రామాల జంక్షన్ వద్ద వృథాగా పోతున్న తాగునీరు

అనకాపల్లి: వేసవి కాలంలో తాగునీటి కోసం పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మార్టూరు, మాకవరం, సీహెచ్.ఎస్.అగ్రహారం మూడు రోడ్ల జంక్షన్ వద్ద నిత్యం తాగునీరు వృథాగా పోతున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ మండల నాయకుడు వియ్యపు రాజు అన్నారు. గురువారం జంక్షన్ వద్ద వృథాగా పోతున్న తాగునీటి గొయ్యిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం రోజులుగా తాగునీరు వృథాగాపోతుందని, దెబ్బతిన్న మెగా వాటర్ ప్లాంట్ పైపులైన్ విషయంపై నేటికీ అధికారులు దృష్టి సారించడం లేదన్నారు. తక్షణమే పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని ఆయన కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 4,458 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,790	4,420
మొదటి రకం	3,600	4,300
రెండో రకం	3,110	3,790
మూడో రకం	2,800	3,080

అనకాపల్లి సినిమాలు

రాజా	:ట్రైలర్
సత్యనారాయణ స్క్రీన్-1	: రాబిన్‌హుడ్
సత్యనారాయణ స్క్రీన్-2	:సికిందర్
పర్తిసాయి	:కోర్టు
షిర్డీసాయి	:లైఫ్
వెంకటేశ్వర	:షణ్ముఖ
శ్రీసత్య	సంక్రాంతికి వస్తున్నాం.
రామచంద్ర	: వీర ధీర శూర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 47 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-28 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 289 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని ఫోన్ నంబర్ 08924-223595లో సంప్రదించవచ్చు.



ఈగరంపూడి గ్రామంలో మట్టి నమూనాను సేకరిస్తున్న, మండల వ్యవసాయ శాఖ అధికారి రంగాచారి

50 రోజుల్లో పరీక్షల ఫలితాలు...

భూసార పరీక్షల నిమిత్తం సేకరించిన మట్టి నమూనాల ఫలితాలు సుమారుగా 50 రోజుల్లో వస్తాయి. రైతు సేవా కేంద్రాల ద్వారా భూసార పరీక్షలకు ఫలితాన్ని రైతులకు సర్టిఫికెట్ల రూపంలో అందజేస్తారు. పరీక్షలు ఉచితంగా వ్యవసాయశాఖ అధికారులు నిర్వహిస్తారు. రైతుల పొలంలో నత్రజని, పొటాష్, భాస్వరం, కాల్షియం, ఐరన్‌తోపాటు సేంద్రియ కర్బనం ఎంత మేరకు భూమిలో ఉన్నాయో తెలుస్తోంది. భూసారాన్ని పెంపొందించేందుకు ఎలాంటి పోషక విలువలు కలిగిన ఎరువులు వాడాలో వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచనలు చేస్తారు.



వెంకుపాలెం గ్రామంలో భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖాధికారి

భూసార పరీక్షలతో..
మేలైన సాగు.. దిగుబడి

భూసార పరీక్షలకు సిద్ధమవుతున్న రైతులు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో భూసార పరీక్షలు

మూడు నెలల తరువాత రైతులకు భూసార పరీక్షల రిపోర్ట్ అందజేత

అనకాపల్లి మండలంలో మొత్తం 13 వేల ఎకరాలు కాగా, 10,200 ఎకరాల్లో సాగు

గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 6,400 ఎకరాల్లో వరి సాగు

ఈ ఏడాది 6,800 ఎకరాల్లో వరిసాగుకు ప్రత్యేక చర్యలు

అనకాపల్లి: వ్యవసాయ శాఖ భూసార పరీక్షలకు శ్రీకారం చుట్టింది. భూసార పరీక్షల కోసం భూమిలో మట్టి నమూనాలను సేకరించేందుకు ఖరీఫ్, రబీ సీజన్ల ప్రారంభ సమయం చాలా అనుకూలంగా ఉంటుంది. ఆ సమయంలో పొలాలు బీడు భూములుగా ఉంటాయి. అలాంటప్పుడు మట్టి నమూనాలు సేకరిస్తే కచ్చితమైన ఫలితాలు వస్తాయి. మండలంలో రైతులు పంటలు పండించేందుకు భూసార పరీక్షలతోనే భూమిలో **పోషక విలువలను సమతు**ల్యంగా ఉంచుకోవచ్చు. మండలంలో ఖరీఫ్, రబీ **సీజనల్లో సుమారుగా** 14వేల మంది **రైతులు ఉండ**గా గత ఏడాది 910 రైతుల పొలాల్లో **మట్టి** నమూనాలు సేకరించి పరీక్షించారు. ఈ ఏడాది మరింత మట్టిని సేకరించి భూసార పరీక్షలు నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా సేకరించిన మట్టి నమూనాలను జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ల్యాబ్‌కు పంపారు.

లోపాల నిర్ధారణ.. సమతుల్యతకు ఆస్కారం

భూసార పరీక్షా ఫలితాల ద్వారా సారం కోల్పోయిన భూమిలో పోషక విలువల సమతుల్యత సాధించి అధిక దిగుబడులు సాధించవచ్చు. భూసార పరీక్షల కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నీటి సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో బోర్లు, బావుల ద్వారా అన్ని సీజన్లలో ఏడాది పొడవునా పంటలు సాగు చేస్తున్నారు. పొలాల్లో ఏడాదికి ఒకసారి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవడం మంచిది. భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల రైతులకు మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. వర్షాధార భూములు, మెట్ట భూముల్లో మూడేళ్లకు ఒకసారి భూసార పరీక్షలలు చేయించుకోవాల్సి ఉంటుంది. రైతులు సాగు చేసిన ప్రతి సారి భూమిలో నత్రజని, భాస్వరం వినియోగం ఎక్కువగా ఉంటోంది. భూసార పరీక్షల ద్వారా భూమిలో నీటిశాతం ఎంత వరకు తగ్గిందో తెలుసుకోవచ్చు. తద్వారా పంటల సాగు చేసే ముందు తగిన మేరకు మందులు పిచికారి చేస్తే భూసారం మళ్లీ యథాస్థితికి చేరుకొని మంచి దిగుబడి సాధించవచ్చును.

సాగు లక్ష్యం పెంపు

మండలంలోగత ఏడాది ఖరీఫ్ సీజన్‌ల్లో 6400 ఎకరాల్లో వరి పంట వేశారు. ఈ ఏడాది సుమారుగా 6600 ఎకరాల్లో వేసేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుంది. ప్రభుత్వ అంచనాలు మేరకు మండలంలో సాగుభూమి సుమారుగా 13వేల ఎకరాలు ఉన్నాది. వరి, నువ్వులు, జనుము, ఆకుకూరలు, కూరగాయలు ఇతర పంటలు సుమారుగా 4వేల ఎకరాల్లో రైతులు పండిస్తున్నారు. మండలంలో సాగుభూమి 10,200 ఎకరాలు ఉంది.



మార్టూరులో రైతుకు భూసార పరీక్ష సర్టిఫికెట్ అందజేస్తున్న, రంగాచారి(ఫైల్)

ఒకే పొలంలో ఏడు చోట్ల మట్టి సేకరణ

భూసార పరీక్షల్లో భాగంగా ఒక పొలంలో ఏడు చోట్ల మట్టి నమూనాలు సేకరిస్తారు. వర్షాధార భూములైనా, నీటి సౌకర్యం ఉన్న భూములైనా మట్టి సేకరణ విధానం ఒకేలా ఉంది. సేకరించిన మట్టి మొత్తాన్ని ఒకే చోట కలిపి భూసార పరీక్షలు చేస్తారు. తద్వారా పొలంలో పోషకాలు ఎంత మేరకు ఉన్నాయో తెలిసే అవకాశం ఉంటుంది.

భూసార పరీక్షలతో రైతులకు మేలు



రైతులు ప్రతి ఏడాది భూసార పరీక్షలు చేయించుకోవడం చాలా మంచిది. భూమిలో పోషకాలు కనుగొని సమతుల్యత పాటించవచ్చు. భూసారపరీక్షలు చేయించి పంటలు సాగు చేస్తే మంచి దిగుబడి వస్తోంది. గ్రామాల్లో రైతులకు దశలు వారిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– పి.రంగాచారి, మండల వ్యవసాయశాఖ అధికారి

తొందరపడి.. భంగపడ్డారు..!



కందిపప్పు

అనకాపల్లి టౌన్: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు అపహాస్యానికి గురవుతున్నాయి. గురువారం సాక్షి దినపత్రికలో 'ఈసారీ కందిపప్పు లేదు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కె.వి.ఎల్.ఎస్.మూర్తి ఓ ప్రకటనలో వివరణ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా బియ్యం, కందిపప్పు తక్కువ ధరకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయిస్తున్నట్టు పేర్కొన్నారు. అయితే బహిరంగ మార్కెట్‌లో కంటే ఎక్కువ ధరకు అమ్మడమేమిటని నవ్వుకుంటున్నారు. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ డిపోల ద్వారా తెలుపు రంగు రేషన్ కార్డుదారులకు కందిపప్పు, రాగులు, గోదుమ పిండి, నూనె, తదితర నిత్యావసర సరకులు అందుతాయని అంతా ఆశించారు. అధికారంలోకి రాగానే అందిస్తామని హామీలు గుప్పించారు. కానీ బియ్యం, పంచదార పంపిణీ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. వాస్తవానికి బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.115 ఉండగా.. ప్రత్యేక కౌంటర్ల ద్వారా రూ.160 అమ్ముతామని ప్రకటించారు. దీనిని బట్టి నిత్యావసర ధరల నియంత్రణపై అధికారులు కనీసం సమీక్షలు చేయడం లేదని అర్థం అవుతుందని ప్రజలు మండిపడుతున్నారు.

సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు వచ్చేలా చర్యలు చేపట్టాలి



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

అనకాపల్లి టౌన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు వచ్చేలా చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కాంప్లెక్స్‌లో విద్యార్థులతో కలిసి వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడి సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే సమీపంలో ఉన్న బైపాస్‌కు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. జిల్లా కేంద్రంగా మారినా కాంప్లెక్స్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు రావడంలేదని, వెంటనే సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని బొడ్డేడ అప్పారావు, బోట్టా చిన్నియాదవ్, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరావు, తదితరులు కోరారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై 12న సదస్సు



విద్యుత్ ఉద్యోగుల సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్.శంకరరావు

అనకాపల్లి: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 12న విశాఖ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నట్టు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు తెలిపారు. స్థానిక గవరపాలెం విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద సదస్సు కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికుల జీతాలను పెంచాలని, కొత్త పీఆర్సీ అమలు చేయాలని, బకాయి డీఏలను తక్షణమే చెల్లించాలని కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, మోదీ తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణ చట్టాన్ని మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వేగంగా అమలు చేస్తూ అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు విద్యుత్ రంగాన్ని కట్టబెట్టాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పీస్ రేట్ పేరుతో విద్యుత్ ఉద్యోగులను మోసం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ చంద్రశేఖర్, డివిజన్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, వర్కింగ్ అధ్యక్షుడు ఎస్.డి.అప్పారావు, సహాయ కార్యదర్శి ఎం.రామకృష్ణ, ఉపాధ్యక్షుడు కె.జైరాజ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

అనకాపల్లి టౌన్: జీవీఎంసీ జోన్-7 పరిధిలోని 80, 81, 82, 83, 84 వార్డుల్లో నివాసముంటూ వివిధ కార్పొరేషన్ల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు యూసీడీ పీడీ సంతోష్‌కుమార్ తెలిపారు. గుండాల జంక్షన్‌లోని ఆర్‌వో ఆఫీస్‌లో జరిగే ఈ ఇంటర్వ్యూలకు దరఖాస్తు పత్రం, తెల్ల రేషన్ కార్డు, రైస్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, కుల ధ్రువీకరణ జెరాక్స్ పత్రాలతో అభ్యర్థులు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

నేడు వయోవృద్ధులకు గుర్తింపు కార్డుల పంపిణీ

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గవరపాలెం వీవీ రమణ రైతుభారతి కేంద్రంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వయోవృద్ధులకు గుర్తిపు కార్డులు ఉచితంగా అందిస్తామని జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు తెలిపారు. ఈ అవకాశాన్ని 60 సంవత్సరాలు దాటిన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భవిత కేంద్రానికి ఎన్టీపీసీ వితరణ



కశింకోటలోని భవిత కేంద్రానికి పరవాడ ఎన్టీపీసీ అందించిన బోధన సామగ్రి

కశింకోట: కశింకోటలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో ఉన్న భవిత కేంద్రానికి పరవాడ ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.82 వేల విలువైన బోధన సామగ్రిని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో సురేష్‌కుమార్ మాట్లాడుతూ బోధనా సామగ్రిని భవిత కేంద్రానికి అందించడం అభినందనీయమన్నారు. బాలికల స్కూల్ హెచ్ఎం సీహెచ్.రామునాయుడు, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు బి.వి.రమణమ్మ, ఎస్.దీప, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

3వ రోజూ కొనసాగిన క్వారీ కార్మికుల సమ్మె



క్వారీ కార్మికుల సమ్మెను ఉద్దేశించి మాట్లాడుతున్న పండా గణేష్

అనకాపల్లి: మండలంలోని క్వారీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఆయా యాజమాన్యాలు చర్యలు చేపట్టకపోవడం అన్యాయమని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు పండా గణేష్ అన్నారు. బవులవాడ పంచాయతీ దర్జీనగర్ గ్రామంలో తలపెట్టిన క్వారీ కార్మికుల సమ్మెకు గురువారం ఆయన సంఘీభావం తెలిపి, మాట్లాడారు. గత మూడు రోజులుగా కార్మికులు సమ్మె చేస్తుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు, క్వారీ యాజమాన్యం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికులకు ఎటువంటి భద్రత, హక్కులు లేకుండా చేసిందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వారీ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కోన మోహనరావు, సంఘం నాయకులు శానాపతి అప్పలనాయుడు, చింతల రమేష్, ఎ.అప్పలనాయుడు, లింగ, సీహెచ్.చిన్నారావు, చవితిన నూకరాజు, గొరప్రల్లి తాతబాబు, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉజ్వల భవిష్యత్తు



ఉచిత పాలిసెట్ శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ ఉమాశంకర్

కశింకోట: పాలిటెక్నిక్ విద్య ఇంజినీరింగ్ కోర్సులు చదవడానికి, ఉద్యోగావకాశాలు పొందడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆర్ఈసీఎస్‌లోని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.ఉమాశంకర్ అన్నారు. కశింకోటలోని ఆర్ఈసీఎస్‌లో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత పాలిసెట్ శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలిటెక్నిక్‌లో ఏ బ్రాంచి చదవాలి, ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి.. వంటి అంశాలను వివరించారు. అర్ఈసీఎస్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల పిల్లలు, జిల్లాలోని టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఉచిత శిక్షణ తరగతులను వినియోగించుకోవచ్చునన్నారు. తరగతులు రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయని చెప్పారు. శిక్షణకు వచ్చే ప్రతి విద్యార్థికి స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. ఇంకా పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేయని విద్యార్థులకు కళాశాలలో ఉచితంగా దరఖాస్తు చేయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రిన్సిపాల్ కర్రి శివ, జనరల్ సెక్షన్ విభాగాధిపతి ఎస్.గణేష్, ఎలక్ట్రికల్ విభాగాధిపతి పి.రమణకుమార్, సీనియర్ లెక్చరర్లు వై.వీరేంద్ర, ఎం.జగదీష్, పాల్గొన్నారు.

పని భారంపై అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన



జెట్టపురెడ్డితునిలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కశింకోట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని జెట్టపురెడ్డితునిలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేశారు. జెట్టపురెడ్డితుని సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగేషు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు పనికి తగ్గ వేతనం అందించాలన్నారు. పని భారం తగ్గించాలన్నారు. గతంలో కన్నా అనేక యాప్‌ల ద్వారా డేటా నింపడానికి సమయం సరిపోతోందన్నారు. బాల సంజీవని 2.0 యాప్ సమర్థవంతంగా పని చేసేలా మెరుగుపర్చాలన్నారు. గ్రామాల్లో పింఛన్ల పంపిణీ నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలను మినహాయించాలని కోరారు.

కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు 512 మంది హాజరు

కశింకోట: వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం రాయితీపై అందించే రుణాల కోసం లబ్ధిదారుల ఎంపికకు గురువారం కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 640 మంది దరఖాస్తు చేసుకోగా.. 512 మంది హాజరయ్యారని ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. వీరిలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం 496 మంది, కాపు కార్పొరేషన్ ద్వారా నలుగురు, బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ముగ్గురు, వైశ్యా కార్పొరేషన్ ద్వారా 9 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారన్నారు. ఈవోపీఆర్డీ ఎం.వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు రామచంద్రరావు, ఎన్.సత్యారావు, మేరీ జోన్స్, సచివాలయ, మండల పరిషత్, బ్యాంకు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: తుమ్మపాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనులు, జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ కశింకోట ఏఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

చెరువు పూడికతీత పనులు ప్రారంభం



తుమ్మల చెరువు పూడికతీత పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ గున్నయ్యనాయుడు

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద తుమ్మల చెరువు మరమ్మతు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు ఈ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులను నాణ్యతతో పూర్తి చేసి రైతులకు ఉపయోగపడే లా తయారు చేయాలన్నారు.